www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

శుక్రవారం
02.10.2026

4లో..



ఈసారి చలి తక్కువే!

ఎల్‌నినోతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- సాధారణం కంటే తక్కువ వర్షా పాతం
- ఎండకాలాన్ని తలపించేలా అక్టోబర్

ఈ ఏడాది శీతాకాలంలో చలి తీవ్రత తగ్గి సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాలు తగ్గడంతో పాటు అక్టోబర్ నెల ఎండకాలాన్ని తలపించేలా వేడిగా మారనుందని తాజా నివేదికలో స్పష్టం చేసింది. ఈ వాతావరణ మార్పులకు సంబంధించిన సమగ్ర వివరాలు ఇలా ఉన్నాయి.

కలంజ్యోతి బ్యూరో


2 ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు

ఉద్యోగులు, పెన్షనర్లకు కేబినెట్ ఆమోదం

5లో

- రూ.2,500 కోట్ల మేర అదనపు భారం
- 235 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు
- కేంద్ర సాయం కోసం ఢిల్లీకి మంత్రుల బృందం
- గ్రీన్ ఎనర్జీ, ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు





తెలంగాణ శాసన సభ

శ్రద్ధాంజలి

"వరంగల్ జిల్లాలోని, నర్సంపేట్ శాసన సభ నియోజకవర్గం మాజీ సభ్యులు శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి గారు ఈ రాష్ట్ర ప్రజలకు అందించిన నిరుపమాన సేవలను స్మరిస్తూ, 2026 సెప్టెంబర్ 8వ తేదీన తెలంగాణ శాసన సభ ఘనంగా నివాళులర్పించింది.

మాజీ సభ్యులు శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది."

అను సంతాప తీర్మానాన్ని సభ ఏకగ్రీవంగా ఆమోదించి, శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి గారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ కొద్దిసేపు మౌనం పాటించింది.

(గడ్డం ప్రసాద్ కుమార్)
సభాపతి
తెలంగాణ శాసన సభ

దివంగత సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళి

ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం

కుటుంబానికి శాసనసభ ప్రగాఢ సానుభూతి



నర్సంపేట మాజీ శాసనసభ్యులు, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజాసేవలను తెలంగాణ శాసనసభ కొనియాడింది. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తూ సభలో ఏకగ్రీవంగా శ్రద్ధాంజలి తీర్మానాన్ని ఆమోదించింది. ఈ మేరకు శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతకం చేసిన అధికారిక తీర్మానం ప్రతిని గురువారం వారి కుటుంబ సభ్యులకు స్థానిక తహశీల్దార్ ద్వారా అందజేశారు.

కలంజ్యోతి, నల్లబెల్లి

3లో

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 02.10.2026
2
www.kalamjyothi.com

సాంకేతికతతోనే వ్యవసాయం లాభసాటి

నిర్మల్ ఎంపీ గోడం నగేష్



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 02) : మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఆధునిక సాంకేతికతను దృష్టిలో ఉంచుకొని రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చుకోవాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్ఎన్ఎస్ కన్వెన్షన్‌లో ఆత్మ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి కిసాన్ మేళాను కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోవస్తున్న నూతన శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. బెట్టను తట్టుకునే రకాలు, తక్కువ నీటితో సాగు చేసే ఆరుతడి పంటలు, పంట మార్పిడి విధానాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ పరిస్థితులను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వంట నూనెలకు సంబంధించి విదేశాలపై ఆధారపడటం తగ్గించేందుకు ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని సూచించారు.

రైతుల సమస్యల పరిష్కారానికే కిసాన్ మేళా..

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రబీ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయడంతో పాటు సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకే కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ఎరువుల సరఫరా, పంటల బీమా, బ్యాంకింగ్ సేవలు, ఆధునిక సాగు విధానాలపై స్టాళ్ల ద్వారా అధికారులు సలహాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే 100 శాతం పూర్తయిందని, దీనివల్ల పంటల వివరాల్లో తప్పులు దొర్లే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్లు వివేకానంద, రాంరెడ్డి, సత్యనారాయణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్ రెడ్డి, కళ్యాణ్, ఎఫ్ఎన్ఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఉద్యానవన అధికారి రమణ, పశుసంవర్ధక శాఖ అధికారి సురేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీధర్ చౌహాన్, రాహుల్ విశ్వకర్మ, రాంగోపాల్ వర్మ, దినేష్, సురేష్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 02) : నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ బస్ డిపో వెనుక నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లలో 192 ఫ్లాట్లను లక్కీ డ్రా ద్వారా అర్హులైన లబ్ధిదారులకు కేటాయించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఈ కేటాయింపు ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపికైన లబ్ధిదారులకు బ్లాక్, ఫ్లాట్ నంబర్లను లక్కీ డిప్ ద్వారా కేటాయించారు. ప్రజాప్రతినిధులు, లబ్ధిదారుల సమక్షంలో పూర్తి స్థాయి వీడియోగ్రఫీ మధ్య అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.

అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలి..

ఇళ్ల నిర్మాణంలో చివరి దశలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిగిలి ఉన్న చివరి దశ పనులను లబ్ధిదారులు స్వయంగా చేసుకుంటే, అందుకు సంబంధించిన నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. లక్కీ డ్రా ద్వారా ఎంపిక జరగడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేయగా, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియ అంతా పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా యంత్రాంగం స్పష్టం చేసింది.

పటిష్ట భద్రతతో సీఎం పర్యటన సక్సెస్

ఎస్పీ మహేష్‌కు పోలీస్ అధికారుల సంఘం సన్మానం

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 01) : జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన, గణేష్ నిమజ్జన వేడుకలను అత్యంత పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో విజయవంతంగా పూర్తి చేసినందుకు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితేను పోలీస్ అధికారుల సంఘం సభ్యులు ఘనంగా అభినందించారు. ఎస్పీ ఆధ్వర్యంలో శాంతి భద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందస్తు ప్రణాళికతో సమర్థవంతమైన బందోబస్తు నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా గణేష్ నిమజ్జనం, సీఎం పర్యటనను విజయవంతంగా నిర్వహించినందుకు పోలీస్ అధికారుల సంఘం సభ్యులు గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విధి నిర్వహణలో ఆయన చూపిన చొరవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు ఎస్సై వెంకట్రాజం, సెక్రటరీ నాగేశ్వరరావు, శ్రీనాథ్ రాజ్, ప్రకాష్, వేణు, తిరుపతి, మహేష్ పాల్గొన్నారు.





ఎన్నికల వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర

ఎస్ఐఆర్ రద్దుకు వామపక్షాల డిమాండ్

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 02) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి కేంద్ర ఎన్నికల సంఘం తొత్తుగా మారిందని, ఎస్ఐఆర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి ఓట్ల చోరీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గురువారం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నిర్మల్ జిల్లా కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ పేరుతో కొత్త నాటకానికి తెరలేపిందని మండిపడ్డారు. దీనివల్ల గ్రామీణ పేదలు, వలస కూలీలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలకు చెందిన లక్షలాది మంది ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకుంటున్నారని విమర్శించారు. బీహార్ సహా ఇతర రాష్ట్రాలలో జరిగిన ఓట్ల తొలగింపు వ్యవహారమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడలేని జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయండి

గుండ్ల మాచ్నూర్ సర్పంచ్ శ్రీహరి

డీఈవో రోహిణికి వినతి

కలంజ్యోతి, నర్సాపూర్ (అక్టోబర్ 02) : ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని గుండ్ల మాచ్నూర్ సర్పంచ్ శ్రీహరి డిమాండ్ చేశారు. హత్నూర మండల పరిధిలోని గుండ్ల మాచ్నూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ శ్రీహరి, ఉప సర్పంచ్ శంకర్‌లు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) రోహిణిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో ఇప్పటికే సబ్జెక్టులకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతుంటే, ఉన్న ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పేరుతో పంపించడం ఎంతమాత్రం సరికాదని వారు పేర్కొన్నారు. ఇలా ఉపాధ్యాయులను తరచూ బదిలీ చేసుకుంటూ పోతే విద్యార్థుల విద్యాభ్యాసం తీవ్రంగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధ్యాయుడు అజ్మత్ అలీ డిప్యూటేషన్‌ను రద్దు చేసి, తిరిగి స్థానిక పాఠశాలలోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. డీఈఓను కలిసిన వారిలో గ్రామ వార్డు సభ్యులు జగన్ యాదవ్, సంతోషా రమేష్ ఉన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
శుక్రవారం 02.10.2026
www.kalamjyothi.com



దివంగత సుదర్శన్‌రెడ్డికి ఘన నివాళి

ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం

కుటుంబానికి శాసనసభ ప్రగాఢ సానుభూతి

కలంజ్యోతి, నల్లబెల్లి (అక్టోబర్ 02) : నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజాసేవలను కొనియాడుతూ తెలంగాణ శాసనసభ ఆయన మృతికి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించింది. ఆయన ప్రజలకు అందించిన విశేష సేవలను స్మరిస్తూ సెప్టెంబర్ 8న శాసనసభలో శ్రద్ధాంజలి తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ క్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సంతకం చేసిన శ్రద్ధాంజలి తీర్మానం కాపీని గురువారం వరంగల్ జిల్లా మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్ రెడ్డికి నల్లబెల్లి ఎంఆర్ఓ అందజేశారు.



కుటుంబానికి శాసనసభ ప్రగాఢ సానుభూతి
రాష్ట్ర ప్రజలకు పెద్ది సుదర్శన్ రెడ్డి అందించిన నిరుపమాన సేవలను శాసనసభ అధికారిక తీర్మానంలో ప్రత్యేకంగా స్మరించుకుంది. ఆయన మృతి పట్ల శాసనసభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకసంతప్త కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. అనంతరం దివంగత మాజీ ఎమ్మెల్యే జ్ఞాపకార్థం శ్రద్ధాంజలి ఘటిస్తూ సభ సభ్యులంతా కొద్దిసేపు మౌనం పాటించారు.

సౌర విద్యుత్‌తో బిల్లుల భారం దూరం

సౌర శక్తిని సద్వినియోగం చేసుకోండి



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 02) : గృహ వినియోగదారులు సౌర విద్యుత్‌ను సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లుల భారాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్-ముఫ్త్ బిజ్లీ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో సేవా సేతు కార్యక్రమంలో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పథకం కింద గృహాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సొంత అవసరాలకు విద్యుత్ ఉత్పత్తి చేసుకోవడంతో పాటు విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు విధానం, దరఖాస్తు ప్రక్రియ, బ్యాంకు రుణ సదుపాయాలపై వినియోగదారులకు సమగ్రంగా వివరించారు.

సత్వర రుణాలు అందించాలి
పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి గృహ వినియోగదారుడికి చేరేలా విద్యుత్, బ్యాంకింగ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉన్నవారికి దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలపై పూర్తి సహకారం అందించాలని తెలిపారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులకు బ్యాంకులు సకాలంలో రుణ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగం వల్ల సంప్రదాయ విద్యుత్‌పై ఆధారపడటం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని అధికారులు వివరించారు. ప్రజలు పథకంపై పూర్తి అవగాహన పెంచుకుని అందుబాటులో ఉన్న ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీజీ ఎన్‌పీడీసీఎల్ డివిజనల్ ఇంజినీర్ నాగరాజు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, టౌన్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

ఎగువ మానేరుకు సాగునీరందించాలి

9వ ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టాలి



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 01) : ఎగువ మానేరు 9వ ప్యాకేజీ పనులను తక్షణమే చేపట్టి పూర్తి చేయడం ద్వారా సుమారు లక్ష ఎకరాల సాగుభూమికి శాశ్వతంగా సాగునీరు అందించాలని ఎగువ మానేరు ప్రాజెక్టు పరిరక్షణ సమితి కోరింది. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, సమితి అధ్యక్షుడు కటకం మృత్యుంజయం మాట్లాడారు. అనంతరం ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ ప్రాంతానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఆ తర్వాత ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చోటుచేసుకుని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీలుగా పనులు కొనసాగాయని వివరించారు. ఎగువ మానేరు ప్రాంతానికి అత్యంత కీలకమైన 9వ ప్యాకేజీ పనులు పూర్తిస్థాయిలో ముందుకు సాగకపోవడంతో నిరిసిల్ల ప్రాంత రైతులు సాగునీటి కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పనులు పూర్తయితే సుమారు లక్ష ఎకరాలకు శాశ్వతంగా సాగునీటి ప్రయోజనం దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల పర్యటన సందర్భంగా ప్రాజెక్టును పరిశీలించి, 9వ ప్యాకేజీకి నిధులు మంజూరు చేసి నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేశారు. కుడి, ఎడమ కాలువల దెబ్బతిన్న లైనింగ్ పనులను పునరుద్ధరించి, నీటి వృథా అరికట్టేలా కాలువ వ్యవస్థను ఆధునీకరించాలని సూచించారు.

ఎగువ మానేరును పర్యాటకంగా తీర్చిదిద్దాలి..
ఎగువ మానేరు కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాకుండా ప్రకృతి అందాలతో అలరారే ప్రాంతమని కటకం మృత్యుంజయం పేర్కొన్నారు. రిజర్వాయర్ పరిసరాలను సుందరీకరించి పర్యాటక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పర్యావరణానికి ఆటంకం కలగకుండా వ్యూ పాయింట్లు, వాకింగ్ ట్రాక్‌లు, బోటింగ్ వంటి సదుపాయాలు కల్పించాలని కోరారు. దీనివల్ల వ్యవసాయంతో పాటు పర్యాటక రంగం అభివృద్ధి చెంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 9వ ప్యాకేజీ పనుల వేగవంతానికి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సమావేశంలో సమితి కన్వీనర్ ఓరుగంటి తిరుపతి, నాయకులు పెద్దిగారి శ్రీనివాస్, కూతూరు వెంకట్ రెడ్డి, బండారి బాల్ రెడ్డి, కాంపెల్లి శ్రీనివాస్, చిట్యాల వెంకన్న, భూక్య గురుబాబు, సిరిసిల్ల మహేష్, గట్టు లింగారెడ్డి, రాగుల రాములు, బాలరాజు, పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

సర్పంచ్ మహబూబ్ సింగ్ రాథోడ్



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 02) : గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై నిరంతరం అవగాహన కలిగి ఉంటూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. మండలంలోని చెరువు కొమ్ము తండా గ్రామపంచాయతీలో సర్పంచ్ మహబూబ్ సింగ్ రాథోడ్ ఆధ్వర్యంలో, చెన్నారావుపేట పీహెచ్‌సీ సహకారంతో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడుతూ వర్షాకాలం, శీతాకాలాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ కాబట్టి ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సర్పంచ్ మహబూబ్ సింగ్ రాథోడ్ మాట్లాడుతూ గ్రామస్తులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, ఎలాంటి ఆరోగ్య సమస్య తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ శిబిరంలో 60 మందికి పైగా గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రియాంక, సూపర్‌వైజర్ కీర్య, హెల్త్ అసిస్టెంట్లు శివాజీ, సురేందర్, ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు సునీత, ఉమా, వార్డు సభ్యులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
4
శుక్రవారం 02.10.2026
www.kalamjyothi.com



విద్యార్థుల్లో సృజనాత్మక ప్రతిభ అద్భుతం

దేశ నిర్మాణంలో యువతే కీలకం

సేవా సంకల్ప్ అభియాన్ వరంగల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

కలంజ్యోతి, నర్సంపేట (అక్టోబర్ 02) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నర్సంపేట పట్టణంలోని డాఫోడిల్స్ సీబీఎస్ఈ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సేవా సంకల్ప్ అభియాన్ వరంగల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నరేంద్ర మోదీ-నేటి భారతం అనే అంశంపై విద్యార్థులు దేశ అభివృద్ధి, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, అంతరిక్ష రంగంలో విజయాలు, యువతకు లభిస్తున్న అవకాశాలను తమ చిత్రాల ద్వారా అద్భుతంగా ఆవిష్కరించడంతో పాటు ఉపన్యాస పోటీల్లో చక్కటి వాగ్ధాటిని ప్రదర్శించారు. ఈ సందర్భంగా



డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే దేశభక్తి, సామాజిక బాధ్యత, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చదువుతో పాటు నాయకత్వ లక్షణాలు, నైపుణ్యాలను పెంపొందించుకుని భవిష్యత్తులో దేశ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

పోటీలతోనే విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభ వెలుగులోకి..

పాఠశాల చైర్మన్ చింతల నరేందర్ మాట్లాడుతూ ఇలాంటి పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభ వెలుగులోకి వస్తుందని, దేశంపై అవగాహనతో పాటు వారిలో ఆరోగ్యకరమైన పోటీతత్వం పెరుగుతుందని తెలిపారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, చింతల నరేందర్ చేతుల మీదుగా బహుమతులు అందజేసి ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ జూలూరి రోజారాణి, పార్లమెంట్ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రేసు శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు అంబేద్కర్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, పట్టణ ఉపాధ్యక్షులు విజయ్ సింగ్, నాగేంద్రబాబు, ముత్యాల శ్రీనివాస్, పోనుగోటి రవీంద్రచారి, చేను నరేష్, వలస సంతోష్, అజీమ్ పాషా, రాజు, కొండ్రా తరుణ్ సాయి, సంగెపు తేజాతో పాటు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దంపతులకు నివాళి

బాధిత కుటుంబానికి మున్నూరు కాపు సంఘం భరోసా


కలంజ్యోతి, నల్లబెల్లి (అక్టోబర్ 02) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన దంపతులకు నర్సంపేట నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నల్లబెల్లి మండలంలోని లెంకాలపల్లి గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ కస్తూరి విజయలక్ష్మి, మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు రవీందర్ దంపతులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఈ నేపథ్యంలో గురువారం లెంకాలపల్లిలో నిర్వహించిన వారి దశదిన కర్మ కార్యక్రమానికి మున్నూరు కాపు సంఘం నాయకులు హాజరై, మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ అండగా ఉంటామని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ నాగిశెట్టి ప్రసాద్, డివిజన్ నాయకుడు నాడెం శాంతికుమార్, నెక్కొండ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు మాదాసు రవి, ముఖ్య నాయకులు తోట సురేష్, శీలం సత్యనారాయణ, శీలం రమేష్, కేసముద్రం మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షుడు కముటం స్వామి పాల్గొన్నారు.

ఈసారి చలి తక్కువే!

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 01) : పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్‌నినో ప్రభావం వల్ల ఈ ఏడాది శీతాకాలంలో చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) స్పష్టం చేసింది. వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రారంభమైన తరుణంలో తాజా సీజన్ ముందస్తు అంచనాల నివేదికను గురువారం విడుదల చేసింది. సాధారణంగా చల్లబడాల్సిన వాతావరణం కాస్తా రాబోయే రోజుల్లో రాత్రి వేళల్లో సైతం ఉష్ణోగ్రతలు పెరిగి వేడిగా మారే అవకాశముందని అధికారులు తెలిపారు.

ఎల్‌నినోతో ఉష్ణోగ్రతలు..

భూమధ్యరేఖా పసిఫిక్ ప్రాంతంలో బలమైన ఎల్‌నినో పరిస్థితులు నెలకొనడంతో పాటు హిందూ మహాసముద్రంలో తటస్థ ఐఓడీ కొనసాగుతోందని పేర్కొంది. ఈ సముద్ర వాతావరణ



మార్పుల కారణంగా అక్టోబర్ మాసంలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే చాలా ఎక్కువగా నమోదవుతాయని వెల్లడించింది. దీనివల్ల చలి ప్రభావం తగ్గిపోయి రికార్డు స్థాయి చలి తీవ్రత ఉండకపోవచ్చని స్పష్టం చేసింది.

సాధారణం కంటే తక్కువ వర్షా లు..

అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు కొనసాగే సీజన్‌లో తెలంగాణ వ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగానే నమోదయ్యే వీలుందని తెలిపింది. ఇప్పటికే రాష్ట్రంలో 18 శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, ముఖ్యంగా నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో లోటు తీవ్రంగా ఉందని పేర్కొంది. రాబోయే ఈశాన్య రుతుపవనాల ప్రభావం కూడా ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చని వివరించింది.

ఎండకాలాన్ని తలపించేలా అక్టోబర్..

ఈ నెలలో వర్ష సూచనలు పెద్దగా లేకపోవడంతో అక్టోబర్ నెల ఎండకాలాన్ని తలపించే అవకాశ ముందని ఐఎండీ హెచ్చరించింది. పగటి పూట తీవ్రమైన ఎండతో పాటు రాత్రిళ్లు కూడా ఉక్కపోత తప్పదని వెల్లడించింది. వర్షాలు లేక, చలి కూడా ఆలస్యమై తీవ్రమైన వేడి వాతావరణం నెలకొనే పరిస్థితులు కనిపిస్తున్నాయని అధికారులు స్పష్టం చేశారు.



రూ.10వేల పెన్షన్ ఇవ్వాలి

సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 02) : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని, హక్కులు కాపాడాలని డిమాండ్ చేస్తూ సీనియర్ సిటిజన్స్ భారీ ర్యాలీ చేపట్టారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో గురువారం మండల సీనియర్ సిటిజన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో వృద్ధులు తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ మాట్లాడుతూ వయోవృద్ధులకు నెలకు రూ. 10 వేల పెన్షన్ అందించడంతో పాటు రైలు ప్రయాణ చార్జీల్లో రాయితీ పునరుద్ధరించాలని, వృద్ధులకు చట్టబద్ధమైన సమగ్ర రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి, జున్నోతుల రాంరెడ్డి, ఉప సర్పంచ్ దొంతి శ్రీనివాస్, వరంగంటి మల్లయ్య, కంది నారాయణరెడ్డి, అర్శనపెల్లి వెంకటేశ్వరరావు, గట్ల కృష్ణ, కొమ్మాలు, ముత్యం సాంబయ్య, బిక్షపతి, కుమారస్వామి పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 02.10.2026
5
www.kalamjyothi.com

జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్

అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలు నిషేధం

ఎస్పీ మహేష్ బి. గితే



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 01) : శాంతిభద్రతల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల పాటు (అక్టోబర్ 1 నుంచి 31 వరకు) పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూర్చేలా ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసు యంత్రాంగానికి జిల్లా ప్రజలు, అన్ని వర్గాల వారు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ కోరారు.

గాంధీ జయంతిని విజయవంతం చేయండి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 01) : జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించే కార్యక్రమాన్ని నిర్వహించనున్న ట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్ధన రమేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు చెన్నారావుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సొసైటీ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, సర్పంచులు, మార్కెట్ సొసైటీ డైరెక్టర్లు, మండల కమిటీ నాయకులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెల్ నాయకులు, కిసాన్ సెల్, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సైతం ఈ కార్యక్రమానికి హాజరు కావాలని సిద్ధన రమేష్ విజ్ఞప్తి చేశారు.



ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు

కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 01) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన మంత్రిమండలి తీపి కబురు అందించింది. 2024 నుంచి పెండింగ్‌లో ఉన్న డీఏలలో రెండింటిని వెంటనే విడుదల చేసేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగ వర్గాలకు ఆర్థిక ఊరట కల్పించేందుకే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని కేబినెట్ భేటీ అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాకు వెల్లడించారు. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, పింఛనుదారులకు ప్రయోజనం చేకూరనుంది.

రూ.2,500 కోట్ల మేర అదనపు భారం..

రెండు పెండింగ్ డీఏలను ఏకకాలంలో విడుదల చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.2,500 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడనుందని మంత్రి వివరించారు. ఖజానాపై భారం పడినప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం ఈ సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీంతో ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యోగుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపాయి.

235 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు..

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 235 మండలాల్లో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. పంటల నష్టం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం, తాగు, సాగునీటి ఎద్దడిపై మంత్రులు సమీక్షించారు. కరువు నివారణ, ఉపశమన చర్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, త్వరలోనే అన్ని రాజకీయ పక్షాలతో అఖిలపక్ష భేటీ నిర్వహించాలని సీఎం ఆదేశించారు.

కేంద్ర సాయం కోసం ఢిల్లీకి మంత్రుల బృందం..

వర్షాభావ మండలాలను అధికారికంగా కరువు మండలాలుగా ప్రకటించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి తగినంత ఆర్థిక సాయం కోరాలని మంత్రిమండలి తీర్మానించింది. రాష్ట్రంలో నెలకొన్న కరువు తీవ్రతపై పూర్తిస్థాయి నివేదికతో మంత్రులు, ఉన్నతాధికారుల బృందం త్వరలోనే ఢిల్లీకి వెళ్లనుంది. కేంద్ర హోం, వ్యవసాయ మంత్రులను కలిసి వినతిపత్రం అందజేసి జాతీయ విపత్తు సహాయ నిధుల (ఎన్‌డీఆర్ఎఫ్) నుంచి తక్షణ ప్యాకేజీ రాబట్టేందుకు ప్రయత్నించనున్నారు.

గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు పరిపాలనా అనుమతులు..

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం ఆల్‌టైమ్ రికార్డుకు చేరిన నేపథ్యంలో 5,800 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 2 వేల మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ టెండర్లకు మంత్రిమండలి పచ్చజెండా ఊపింది. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు, గట్టు ప్రాజెక్ట్, ఇందిరా సాగర్ ఫ్లడ్ ఫ్లో కెనాల్ నిర్మాణ పనులకు పరిపాలనా ఆమోదం తెలిపింది. మద్యం రంగంలో వైన్ తయారీని ప్రోత్సహించేందుకు గతంలో ఉన్న పరిమితులను సడలించడంతో పాటు 2జీ బార్లలో అడిషనల్ ప్రివిలేజ్ ఫీజు పెంపునకు ఆమోదం తెలిపింది. అలాగే కుటుంబ యజమాని మరణిస్తే రూ.5 లక్షల సాయం అందించే ఇందిరమ్మ బీమా పథకాన్ని నవంబర్ 19న ప్రారంభించాలని నిర్ణయించింది.



డా.ఉమేష్ గుప్తాకు రాష్ట్రస్థాయి పురస్కారం

కలంజ్యోతి, నిర్మల్ : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర స్థాయి అవార్డుల్లో నిర్మల్‌కు చెందిన ప్రముఖ ఆయుర్వేద, న్యూరో థెరపిస్ట్ డాక్టర్ ఉమేష్ గుప్తా రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును స్వీకరించారు. వయోవృద్ధుల సంక్షేమం, వారికి అందుబాటులో ఉండే వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో విశేష కృషి చేసినందుకు గుర్తింపుగా ప్రభుత్వం ఈ పురస్కారాన్ని అందజేసింది. ఆయన గత 32 సంవత్సరాలకు పైగా వైద్యరంగంలో సేవలందిస్తూ వేలాది మంది ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించారు. ముఖ్యంగా వృద్ధులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించడంలో ఆయన ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లోపించింది

మున్సిపల్ కౌన్సిలర్ తిమ్మాజిపేట్ పాండు

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (అక్టోబర్ 02) : నాగర్‌కర్నూల్ పట్టణంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ఏమాత్రం పారదర్శకత పాటించలేదని మున్సిపల్ కౌన్సిలర్ తిమ్మాజిపేట్ పాండు ఆరోపించారు. సుమారు 90 శాతం పనులు పూర్తయిన ఇళ్లకు మిగిలిన పనులు పూర్తి చేయకుండానే 192 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయింపులు జరపడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఇళ్లకు డోర్లు, కిటికీలు, విద్యుత్, డ్రైనేజీ, పెయింటింగ్ వంటి కనీస పనులు ఇంకా పూర్తికాలేదని ఆయన తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ఏ ప్రాతిపదికన జరిగిందో అధికారులు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. అర్హులైన నిరుపేదలకు కాకుండా ఆర్థికంగా స్థోమత కలిగిన వారికి ఇళ్లు కేటాయించారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట కొందరు కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు పేదల వద్ద నుంచి రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేశారన్న ఆరోపణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఎంపిక చేసిన 192 మంది లబ్ధిదారుల జాబితాను తక్షణమే పునఃపరిశీలించాలని, అవసరమైతే నూతన నోటిఫికేషన్ విడుదల చేసి ప్రజా సమక్షంలో డ్రా (డిప్) పద్ధతి ద్వారా అర్హులను ఎంపిక చేయాలని తిమ్మాజిపేట్ పాండు స్పష్టం చేశారు.





సురేష్ కుటుంబానికి ఆటో యూనియన్ పరామర్శ

కలంజ్యోతి, చెన్నారావుపేట : అనారోగ్యంతో మృతి చెందిన తోటి ఆటో కార్మికుడి కుటుంబ సభ్యులను స్థానిక ఆటో యూనియన్ నాయకులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చెన్నారావుపేట మండల కేంద్రానికి చెందిన ఆటో యూనియన్ సభ్యుడు బొంత సురేష్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఆటో యూనియన్ బాధ్యుడు సిద్ద ఉపేందర్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ఉపాధ్యక్షుడు కరెడ్ల శివ అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు బండారి సత్యం, బాషా, గుర్రం బిక్షపతి, ఆంధ్ర చిన్నయ్య, అయిల్ రెడ్డి, రాజ్ కుమార్, గవాస్కర్, కుమార స్వామి, రమేష్, అనిల్, రమేష్, కరుణాకర్, శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.

కలం జ్యోతి
తెలుగు దినపత్రిక
శుక్రవారం 02.10.2026
6
www.kalamjyothi.com



పోలీసు కొలువే లక్ష్యంగా శ్రమించాలి

నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 02) : పోలీసు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. నిర్మల్ జిల్లా పోలీసు అభ్యర్థులకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి దూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ పొందడం ఎంతో ఖర్చుతో కూడుకున్న పని అని తెలిపారు. ప్రస్తుత కృత్రిమ మేధ యుగంలో ఉద్యోగ సాధనలో తీవ్ర పోటీ నెలకొందని, అభ్యర్థులు సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉంటూ కష్టపడి చదివి ఉద్యోగం సాధించాలని ఆకాంక్షించారు. దూర ప్రాంతాల విద్యార్థులకు వసతి సౌకర్యాల కల్పనలో తమవంతు సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ పోలీసు ఉద్యోగమే లక్ష్యంగా అభ్యర్థులు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కోసం దాదాపు 300 మంది పేర్లు నమోదు చేసుకున్నారని, అభ్యర్థులకు ఒక పూట భోజనం, అల్పాహారం సహా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. దూర ప్రాంత విద్యార్థులకు వసతి ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఖైసా ఏఎస్పీ సాయి కిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎం శ్రీ పాఠశాల పరిశీలన

విద్యాబోధన, వసతులపై ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ సంతృప్తి

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 01) : ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్ పీఎం శ్రీ ప్రాథమిక పాఠశాలను ఎస్సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ గాజర్ల రమేష్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో పీఎం శ్రీ కార్యక్రమాల అమలు తీరు, మౌలిక వసతులు, తరగతుల నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రీప్రైమరీ తరగతులకు వెళ్లి విద్యార్థులకు అందుతున్న బోధన తీరును పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను స్వయంగా పరీక్షించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయ సిబ్బంది చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ అశోక్, ప్రధానోపాధ్యాయుడు సందీప్ రెడ్డితో పాటు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



సభ్యులు లేకుండా పీఏసీఎస్ మహాసభ ఎలా?

హాజరు రిజిస్టర్‌పై సమగ్ర విచారణ చేపట్టాలి

బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్

కలంజ్యోతి, నల్లబెల్లి (అక్టోబర్ 02) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) మహాసభకు సభ్యుల హాజరు అత్యల్పంగా ఉండటంపై బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ గౌడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘానికి సంబంధించిన అత్యంత కీలకమైన మహాసభలో పెద్ద సంఖ్యలో రైతులు, సభ్యులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించాల్సి ఉండగా, సభ్యుల హాజరు లేకుండా నామమాత్రంగా సమావేశం ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఈ మహాసభకు అసలు అవసరమైన కోరం ఉందా లేదా, మొత్తం సభ్యుల సంఖ్య ఎంత, వాస్తవంగా ఎంతమంది హాజరయ్యారు, హాజరు రిజిస్టర్‌లో నమోదైన సంతకాలు అసలైనవేనా అనే అంశాలపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాలి..

మహాసభకు సంబంధించిన హాజరు రిజిస్టర్, నోటీసుల రికార్డులు, తీర్మానాల పుస్తకాన్నిక్షుణ్ణంగా పరిశీలించి వాస్తవాలను సభ్యులకు, ప్రజలకు బహిర్గతం చేయాలని తడుక వినయ్ గౌడ్ కోరారు. విచారణలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే సంబంధిత బాధ్యులపై తక్షణమే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సహకార సంఘాల నిర్వహణలో రైతుల భాగస్వామ్యానికి, పారదర్శకతకు పెద్ద పీట వేయాలని ఆయన హితవు పలికారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు వల్లే పర్వాతలు, ధర్మారం క్రాంతికుమార్, సుధాగాని ప్రమోద్, తిమ్మాపురం శివ, ఈర్ల రవి, కొత్తపెల్లి మధుకర్, కక్కెర్ల రజినీకాంత్ పాల్గొన్నారు.



గాంధీజీ జయంతిని విజయవంతం చేయండి

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాల్నే వెంకన్న



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 01) : జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్లు బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బాల్నే వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, యూత్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



ఎన్సీపీ మహిళా అధ్యక్షురాలిగా పద్మ

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు

కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (అక్టోబర్ 01) : ఎన్సీపీ పార్టీ ఎన్డీయే మహాకూటమి ఎన్సీపీ మహిళా విభాగాన్ని బలోపేతం చేసే దిశగా కరకగూడెం మండలంలో కీలక నియామకాలు చేపట్టారు. మండల మహిళా అధ్యక్షురాలిగా ఆర్ఎం పద్మ, మండల ప్రధాన కార్యదర్శిగా కొమరం చిలకమ్మలను నియమిస్తూ హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అధికారిక నియామక పత్రాలను అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఊకే వెంకన్న సూచనల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు ఎన్సీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతి గ్రామంలో మహిళా కమిటీలను వేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన నూతన నాయకురాళ్లకు సూచించారు.

మహిళా సమస్యలపై నిరంతరం పోరాడుతాం..

తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి నూతన అధ్యక్షురాలు ఆర్ఎం పద్మ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. పార్టీ ఎదుగుదలకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండల మహిళా అధ్యక్షురాలు ఊకే చిట్టెమ్మ, మండల ప్రధాన కార్యదర్శి మీసాల సుజాత, బిందు, వర్ష, వసంత, ఆలవాల ప్రమీల, కొమ్ముూరు చిట్టెమ్మ పాల్గొన్నారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

అనుమతి లేకుండా వాడుకుంటే ఊరుకోను

తన ముందస్తు అనుమతి లేకుండా పేరు, ఫొటోలు, వీడియోలను వాణిజ్యపరంగా వాడుకుంటున్నారంటూ ప్రముఖ నటి ఊర్వశి రౌతేలా లాస్ ఏంజిల్స్‌కు చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఏకంగా రూ. 7,000 కోట్ల నష్ట పరిహారం కోరుతూ న్యాయపరమైన చర్యలకు దిగారు. అనుమతి లేకుండా తన వ్యక్తిగత గుర్తింపును వాడితే సహించేది లేదని ఆమె సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేయగా, ఈ వాదనను బాలీవుడ్ ఏఐ వ్యవస్థాపకుడు షీరాజ్ హసన్ తీవ్రంగా ఖండించారు. ఆమె వేసిన భారీ క్లెయిమ్ హాస్యాస్పదమని కొట్టిపారేసిన ఆయన, ఎవరి చేత బలవంతంగా మాట్లాడించలేదని, రాబోయే కాలం ఏఐదేనని బదులివ్వడంతో ఈ వివాదం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.